క్లుప్తంగా

ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ

ఉండ్రాజవరం: సమగ్ర శిక్షణ పథకం ద్వారా ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగాలల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని పాఠశాల హెచ్ఎం కె.మాణిక్యాలరావు అన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ సుమారు 12 రోజుల పాటు వివిధ ఎలక్ట్రానిక్స్ పరికరాల నిర్వహణ, వాటి సమస్యల పరిష్కారాలు వంటి అంశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. సుమారు 150 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ భాస్కర్, బి.శ్రీనివాసరావు, రాంబాబు, స్వామి, నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాలకు సిద్ధంకండి

పెరవలి: ఖరీఫ్ కోత దశలో ఉన్నాయని రైతులు మూకుమ్మడిగా ధాన్యం ఒబ్బిడి చేసుకుని, అమ్ముకోవచ్చని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు. పెరవలి మండలం కానూరు అగ్రహారం, తీపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ నెలాఖరు నాటికి ఏర్పాట్లు చేయడానికి అన్ని సిద్ధం చేశామని ధాన్యాన్ని రైతులు ఇష్టం వచ్చిన మిల్లులకు ధాన్యాం అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును చేధించిన పోలీసులు

పెరవలి: పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన వనచెర్ల రాణి, ఆమె ఇద్దరు కుమార్తెలతో గత నెల 27వ తేదీన పుట్టింటికి వెళుతున్నానని చెప్పి అదృశ్యం అయిన కేసును పెరవలి పోలీసులు చేధించారు. పెరవలి ఎస్ఐ పి.అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిస్సింగ్ కంప్లెయింట్ వచ్చిన వెంటనే విచారణ చేపట్టామని వనచెర్ల రాణి తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని పుట్టిల్లు అయిన అజ్జరం వెళ్లకుండా నేరుగా తణుకు బస్టాండ్‌కు వెళ్ల అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లిందని దీంతో పోన్ సంభాషణలు ద్వారా తెలుసుకుని వారి ముగ్గిరిని పట్టుకుని తీసుకువచ్చి తల్లి వాసంశెట్టి దుర్గ, భర్త వనచెర్ల జానికి రాముడికి అప్పగించామని తెలిపారు.

చిన్నాయగూడెంలో చోరీ

దేవరపల్లి: చిన్నాయగూడెంలో ఆలపాటి కుమారి ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు 10 రోజుల క్రితం ఆసుపత్రి పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. గురువారం ఉదయం పని మనిషి ఇంటికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించింది. దీంతో యజమానులకు సమాచారం ఇవ్వగా సుమారు 20 గ్రాముల బంగారం ముక్కలు చోరీ జరిగినట్టు గుర్తించారు. దీనిపై యజమాని ఆలపాటి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసే నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై వి.సుబ్రమమణ్యం తెలిపారు. క్లూస్ టీం పరిశీలించినట్టు ఆయన తెలిపారు.

బస్సు పాస్‌ల జారీకి తాత్కాలిక బ్రేక్

కొవ్వూరు: ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు బదిలీల నేపథ్యంలో కొత్త ఉద్యోగులు విధుల్లో చేరనున్నందున ఈనెల 5, 6 తేదీల్లో బస్సు పాసుల జారీని తాత్కాలికంగా నిలిపివేసినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. తిరిగి ఏడో తేదీ నుంచి బస్సు పాసులు యథావిధి అందించనున్నట్టు ఆయన తెలిపారు.

నల్లజర్ల ఎస్ఐ శ్రీహరిబాబు బదిలీ

నల్లజర్ల: సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్ఐ శ్రీహరిబాబు అన్నవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బుధవారం రాత్రి ఆయన ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సేవలతోనే మంచి గుర్తింపు

పెరవలి: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు తప్పవని అది ఉద్యోగ ధర్మంలో భాగమని, నిస్వార్థ సేవలు అందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరేళ్లగా సూపరింటిండెంట్, ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన శింగంశెట్టి రమేష్, సీనియర్ అసిస్టెంట్ అరిగెల వేణుగోపాల్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. పెరవలిలో చివరిరోజు విధులు నిర్వహించిన తరువాత ఇద్దరిని ఘనంగా సన్మానించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరమళ్ల సత్యనారాయణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరన్నను పరామర్శించిన ప్రముఖులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న వీరన్న తండ్రి దుగ్గిరాజు మృతి చెందారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్నను పార్టీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రీజనల్ యూత్ అధ్యక్షుడు జక్కంపూడి గణేష్ ఐ.పంగిడిలోని ఆయన స్వగృహానికి వెళ్లి గురువారం పరామర్శించారు. అనంతరం పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాజీవ్‌కృష్ణలు వీరన్నను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉప్పులూరి సూరిబాబు, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప్పులూరి రాజబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పోషకాల సమాహారం.. సీతాఫలం

- మార్కెట్‌లో విరివిగా సీతాఫలాలు
- ఆకాశాన్నంటుతున్న ధరలు
- కొనుగోలుకు వెనుకాడుతున్న ప్రజలు


అమ్మకానికి సిద్ధం చేసిన సీతాఫలాలు

నల్లజర్ల: పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టంగా తినే పండు సీతాఫలం. సకల పోషక విలువలు గల ఫలం ధరలు ఆకాశానంటుతున్నాయి. మార్కెట్లోకి విరివిగా వస్తున్నా ధరలు మాత్రం తగ్గడం లేదు. వీటిని కొనేందుకు సామాన్య, మధ్యతరగతి ప్రజలు వెనుకాడుతున్నారు. జిల్లాలో నడిబొడ్డున ఉన్న దూబచర్ల సీతాఫలాల అమ్మకాలకు అతి పెద్ద మార్కెట్‌గా ఉంది. నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాలతోపాటు టి.నర్సాపురం, కామవరపుకోట తదితర మండలాల్లో 40, 50 గ్రామాల రైతులు, వ్యాపారులు పొలాల గట్లపైన, కట్టవలలో ఉన్న చెట్లను కొనుగోలు చేసి కాసిన సీతాఫలాలు ఈ సీజన్‌లో ఇక్కడకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి కోసిన కాయలు బుట్టలు కట్టుకొని ఆటోలు, బైక్‌లపై ఇక్కడకు తీసుకు వస్తున్నారు. వందల కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతులు

ఏలూరు, భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, విజయవాడ, విశాఖ తదితర ప్రాంతాలకు ఇక్కడ నుంచి ఎగుమతిలు అవుతుంటాయి. నిత్యం ఇక్కడ లక్షల రుపాయల వ్యాపారం జరుగుతోంది. గత ఏడాది కంటే ఈ సంవత్సరం వర్షాలు అధికంగా ఉండడంతో సీతాఫలాలు ముందుగానే మార్కెట్లోకి వచ్చినట్టు రైతులు చెబుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండడంతో ధరలు మాత్రం సామాన్యులకు అందే స్థాయిలో లేవు. దిగుబడి ఆశించిన రీతిలో లేవని కొత్తగూడెంకు చెందిన రైతు నువ్వుల రత్తయ్య, అయ్యవరంకు చెందిన కామేశ్వరావు వివరించారు.

గతేడాది వంద కాయల బుట్ట రూ.600 నుంచి రూ.800 వరకు ఉండేది. ఈ సంవత్సరం దిగుబడి తక్కువగా ఉండడంతో వంద కాయల బుట్ట రూ.1000 నుంచి రూ.1200 వరకు ఉంది. ఇక్కడ మార్కెట్‌కు వచ్చే కాయలు సైజులో పెద్దవిగా కనిపించకపోయినా రుచి మాత్రం మధురంగా ఉంటుందని ఎర్ర నేలల్లో పండించిన కారణంగానే ఈరుచి ఉందని అమ్మకందారులు చెబుతున్నారు.

కష్టకాలంలో...

ఈ పంట కరువు కాలంలో కర్షకులకు ఆర్థికంగా కొంతమేర ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ మార్కెట్‌లో సీతాఫలాలు అందుబాటులో ఉంటాయి. రైతులకు, చిరువ్యాపారులకు ఆదాయ మార్గంగా ఉపయోగపడుతోంది.

ఔషధ గుణాలు మెండు

సీతాఫలంలో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయి. విటమిన్-ఏ, విటమిన్-ఈ, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, పోటాషియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లు గుండె జబ్బులు ఉన్నవారు సైతం తినవచ్చని చెబుతున్నారు. గ్లూకోజ్‌తో పాటు శక్తి, ఫైబర్ ఉండడం వల్ల మలబద్ధకం నివారణ, మంచి జీర్ణశక్తి, ఎదుగుదల వంటి ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు. అందుకే మార్కెట్‌లో సీతాఫలాలకు డిమాండ్ ఉంది.

దిగుబడి తగ్గింది



ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలతో పూత, పిందె దెబ్బతిన్నాయి. దీనివల్ల పంట మార్కెట్‌కు ఆలస్యంగా వచ్చింది. దీంతోపాటు తోటలు అంతరించిపోతున్నాయి. భూముల విలువ పెరగడంతో తోటలు తీసేసి లేఅవుట్లు వేస్తున్నారు.
– సిరిబత్తుల వెంకటస్వామి, వ్యాపారి, దూబచర్ల

పెంపకానికి ప్రోత్సాహం



గతంతో పోల్చితే తోటల విస్తీర్ణం బాగా తగ్గింది. తోటలు పెంచడంతో పాటు రైతు పొలాల గట్లపై సీతాఫలాల మొక్కలు పెంచడాన్ని ప్రోత్సహిస్తున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
– బబిత ఉద్యాన శాఖాధికారి, నల్లజర్ల

పండ్లకు మంచి గిరాకీ



ఖరీఫ్ పనులు ముగిసిన తర్వాత పంటల కోత సమయం వరకూ సీతాఫలాలు మాకు ఉపాధి చూపుతాయి. కాయల నాణ్యతను బట్టి వంద కాయల బుట్ట రూ.800 నుంచి రూ.1200 వరకు అమ్ముతున్నాం. దిగుబడి తగ్గడంతో కాయలకు మంచి గిరాకీ ఉంది. మూడు నెలల పాటు ఉపాధి ఉంటుంది.
– నాయుడు నాగరాజు, చాదరాశిగుంట

అమ్మలగన్నయమ్మ.. ఆదిపరాశక్తి

- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు
- వాడవాడలా అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ


దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్‌లో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

దేవరపల్లి: అమ్మలగన్న అమ్మ..ఆదిపరాశక్తి ఊరూరా కొలువుదీరింది. భక్తులు అమ్మవారికి పూజలు, హోమలు చేసి దర్శించుకున్నారు. శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో వీధుల్లో చలువ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి, కలశస్థాపన చేశారు. అమ్మవారి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేసి మొదటి రోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరణ చేసి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లో ఉన్న సౌభాగ్యదుర్గాంభికా అమ్మవారి ఆలయంలో వద్ద దసరా ఉత్సవాలు ప్రారంభించారు. స్థానిక హైస్కూలు ప్రాంతంలో వేంచేసిన బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవాలకు కామిశెట్టి ధర్మయ్య, మంగతయారు దంపతుల కుమార్తు సీతారామశివ రూ.30 వేలు విరాళంగా అందజేశారు. మండలంలో పలు గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి.

నిడదవోలు రూరల్: మండలంలోని వాడవాడలా దేవీశరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను పూలతో అందంగా తీర్చిదిద్దారు. తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి శంకర్‌చే జ్యోతి ప్రజ్వలన చేసి కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభించారు. ప్రధాన అర్చకులు ఎస్‌వీకేఏ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. సుమారు 50 మంది భక్తులు కోటసత్తెమ్మ దీక్ష చేపట్టారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.64,512 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

తాళ్లపూడి: మండలంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తాళ్లపూడిలోని నవదుర్గ, శ్రీకచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో 23వ దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మలకపల్లి, వేగేశ్వరపురం, తాళ్లపూడి, గజ్జరం, అన్నదేవరపేట, తాడిపూడి, పైడిమెట్ట తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మ వారి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం, లలితాంభికా అమ్మవారు, మాంతగమ్మతల్లి, కరిచర్లగూడెం అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో అర్చన, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

నల్లజర్ల: మండలంలో దేవీనవరాత్ర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని కలశస్థాపనతో ప్రతిష్ఠించి పూజలు చేశారు. అచ్చన్నపాలెం, నల్లజర్ల, తూర్పుచోడవరం, దూబచర్ల, కవులూరు, పోతవరం తదితర గ్రామాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

చాగల్లు: గ్రామంలో మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో కలశ పూజ, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణగూడెం, రావులచెరువు , ఊనగట్లలో బీసీ ఏరియా, గరప్పాడు, ఎస్.ముప్పవరం, మీనానగరం మార్కొండపాడు, దారవరం, చంద్రవరం, చిక్కాల గ్రామాల్లోను దసరా వేడుకలు ప్రారంభమయ్యాయి.

నిడదవోలు: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ముందు భాగంలో ఉన్న ఆర్యవైశ్య ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పట్టణంలోని రజక వీధి, చిన్న కాశిరేవు, నంగాలమ్మ పూరి గుడి వద్ద, రైల్వే స్టేషన్ రోడ్ చింత చెట్టు వీధిలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.


చాగల్లులో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు


దేవరపల్లిలోని అమ్మవారి ఆలయానికి రూ.30 వేలు విరాళం అందజేస్తున్న ధర్మరాజు, మంగతాయారు కుటుంబ సభ్యులు

కొవ్వూరు: పట్టణ, మండల వ్యాప్తంగా శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. వాడపల్లి గ్రామంలో పుటాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయం వద్ద అమ్మవారి విగ్రహానికి ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారా యుడు), నాయుకులు కాకర్ల బ్రహ్మాజీలు సర్పంచ్ గెల్లా ప్రసాద్, సుంకవల్లి సత్యనారాయణ, తణుకు సూరిబాబు, కోనేటి దుర్గారావు, సుందూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సీతంపేట, దొమ్మేరు, ఐ.పంగిడి, కాపవరం, పశివేదల తదితర గ్రామాల్లోను దసరా ఉత్సవాలు మొదలయ్యాయి.


తిమ్మరాజుపాలెంలో పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు


మునిపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనారాయణస్వామి


తాళ్లపూడిలో శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు


గోపాలపురంలో బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ


నల్లజర్ల వనదుర్గా ఆలయంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు


నిడదవోలు పట్టణంలో 10 అడుగుల అమ్మవారి విగ్రహం


కోటసత్తెమ్మ దీక్ష చేపట్టిన భక్తులతో ఆలయ సిబ్బంది


వేగేశ్వరపురం మేదరపేటలో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

పెరవలి: ప్రభుత్వ పథకాల గురించి ప్రజా ప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేవలం కూటమి నాయకులతో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని మేము ఇంక ఎందుకు అంటూ ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల కన్నా అధికార పార్టీ నాయకులకు అడుగులకు మడుగులొత్తుతున్నారని, తమకు సమాచారం ఇవ్వకుండానే పనిచేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ పథకాలు ప్రజా ప్రతినిధులకు తెలియకుండా లబ్ధిదారులను ఎంపిక చేయడం హాస్యస్పదంగా ఉందని, అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగతుందన్నారు. మినీ గోకులం కేటాయింపులో అన్యాయం జరిగిందని, దానిని ఆమోదించొద్దని ముక్కామల ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ తదితరులు అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలకు ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదంటూ సభలో వాగ్వాదాలు జరిగాయి. దీంతో సభ వాడీవేడిగా సాగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి సునీల్ వినయ్, తహసీల్దార్ డి అత్యుత కుమారి, అన్ని గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.


పెరవలి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

ఉండ్రాజవరం: గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సూచించారు. ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ వంకా మాట్లాడుతూ మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనేత్తిన సమస్యలను మినిట్స్‌బుక్‌లో రాసి, వాటి పరిష్కరానికి అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం అధికారులు వారి పరిధిలో అభివృద్ధిని, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను వివరించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జిడివి.ప్రసాద్, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

తాళ్లపూడి: మానవ వనరులను ఉపయోగించుకుని స్వశక్తితో ఎదిగి సుస్థిర అభివృద్ధి సాధించడానికి అందరు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వర్ణాంధ్ర 2047 పై వివిధ శాఖల అధికారులతో వర్క్ షాప్ నిర్వహించారు. డీపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా వికసిత్ భారత్ 2047లో భాగంగా ప్రపంచంలో అగ్రగామి దేశంగా భారత్ ఉండాలని దాని కోసం ప్రభుత్వం ఒక దార్శనిక పత్రం విడుదల చేసిందన్నారు. తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సీనియర్ సహాయకులు అమ్మిరాజు, సర్పంచ్‌లు గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామ సచివాలయంలో ఈనెల 2న జరిగిన గ్రామసభలో దళిత సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, ఆమె భర్త నాగప్రసాద్‌లను అవమానించిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సమిశ్రగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంకకు సంఘీభావం తెలుపుతూ స్థానిక దళిత నాయకులు గుంపుల నరసింహమూర్తి, వార్డు సభ్యులు బెండపూడి ప్రతాప్‌లు గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు దళిత ప్రజాప్రతినిధులకు గౌరవం కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సుభాష్‌చంద్రబోస్ కె.స్వరాజ్యం, సత్తిపండు, అంగులూరి సునీల్, దెయ్యాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


సమిశ్రగూడెం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

మురుగు బోదెల పూడ్చడంపై వివాదం


తాళ్లపూడి పరిధిలోని కుకునూరులో మురుగు బోదెల వద్ద ఏర్పాటు చేస్తున్న చిన్న తూరలు

తాళ్లపూడి: గ్రామంలో మురుగు బొదెలను పూడ్చివేస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా మండలంలోని ఖాళీ స్థలాల్లో గ్రావెల్‌తో పూడ్చివేయడంతో పాటు వాటి విషయంలో అధికారుల తీరుపై పలు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా అధికార పార్టీ నాయకుల అండతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాళ్లపూడి పరిధిలోని కుకునూరులో ఆంధ్రాబ్యాంక్ వీధి నుంచి ఆర్‌బీకేకు వెళ్లే రోడ్డులో ఇటీవల లేఅవుట్ వేశారు. అయితే వారు సమీపంలోని మురుగు బోదెలను పూడ్చి చిన్న తూరలు పెడుతుండంతో వివాదం చోటు చేసుకుంది. పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నుంచి కాలువ వెళుతున్న ప్రాంతంలో ఉన్న మురుగు బోదెను లేవుట్ నిర్వాహకులు క్వారీ గ్రావెల్‌తో పూడ్చి వేస్తున్నారని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నామన బుజ్జి ఆరోపించారు. గ్రామంలోని మురుగు నీరు ఈ బోదె గుండా వెళుతుందని ఆరు అడుగుల వెడల్పు బోదెను ఆక్రమించి 2 అడుగుల తూరలు పెడుతున్నారని, దీనిపై తహసీల్దార్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీనిపై తహసీల్దార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మినీ గోకులాల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

దేవరపల్లి: పాడి రైతులకు మినీ గోకుల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు ఎస్. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాలకు 350 గోకులాలు మంజూరు కాగా మొదటి దఫాగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు రాయితీపై గోకులాలు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఒక్కొక్క గోకులానికి రూ. 1.80 లక్షలు మంజూరు కాగా, 10 శాతం లబ్ధిదారుని వాటగా చెల్లించినట్టు ఆయన తెలిపారు.